క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని నగర డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దార్ల వెంకటేశ్వర్లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు రైల్వే స్టేషన్ వద్ద ఎంపీకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్పొరేటర్లు ఎస్‌ఆర్ ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనార్టీ నాయకులు షేక్ హాజీ, అల్లంపాటి జనార్దన్‌రెడ్డి, వడ్లమూడి చంద్ర, బీ పిచ్చిరెడ్డి, సునీల్, గంపా నరసింహారావు, మల్లి రత్నయ్య, తిరుమల, పెనుమల్లి శ్రీనివాసులు, చుక్కల బాబు, అల్లాభక్షు గంపా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల విజేతలకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తమిళనాడులోని ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీలో ఈ నెల 29న నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్ సోమవారం అభినందించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యోగా పోటీల్లో జిల్లాకు చెందిన 9మంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. యోగా మాస్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

యోగాలో జిల్లావాసికి బంగారు పతకం

తమిళనాడులో నిర్వహించిన యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ సౌత్ ఇండియా జోనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్–2023లో జిల్లాకు చెందిన పీ అరుణకుమారి సత్తాచాటారు. ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన 500 మంది పాల్గొనగా అరుణకుమారి అత్యుత్తమ ప్రతిభకనబరిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.

బీజేపీ మహిళా మోర్చా పదాధికారుల నియామకం

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిణి మహిళా మోర్చా పదాధికారులను సోమవారం నియమించారు. ఆరుగురు ఉపాధ్యక్షులు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు, ఆరుగురు కార్యదర్శులు, ట్రెజరర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిని నియమించి నియామక పత్రాలను అందజేశారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీ వంశీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు వై రాజేష్, కే బుజ్జిరెడ్డి, ఎస్‌కే యశ్వంత్‌సింగ్ పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



నెల్లూరు(దర్గామిట్ట): కావలిలో ఆర్టీసీ డ్రైవర్ బీ రాంసింగ్‌పై అనాగరికంగా దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఎస్పీ కొందరు నిందితులను అరెస్ట్ చేశారని, దాడి ఘటనపై వాస్తవాలను పరిశీలించి దాడికి పాల్పడిన దుండగులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా అరెస్ట్ చేసి తగు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ పెంచలరెడ్డి, ఓవీ ప్రసాద్, కోచైర్మన్ ఈవీఎం శరత్ బాబు, కోశాధికారి ఎం మాబురావు, అసోసియేషట్ చైర్మన్ బీ మురళీ, అడిషనల్ సెక్రటరీ పొదిలి చిన్నయ్య, ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ బాబు శ్యామ్యూల్, జిల్లా కోశాధికారి మొహిబుల్లా పాల్గొన్నారు.

ధర్మ ప్రచార వారోత్సవాల సామగ్రికి టెండర్లు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ధర్మప్రచార వారోత్సవాలకు సీల్డ్ టెండర్లను సోమవారం తెరిచారు. తక్కువ కోడ్ చేసిన వారికి టెండర్ ఖారారు చేశారు. ప్రచార వారోత్సవాలకు అవసరమైన వివిధ వస్తువులను సరఫరా చేసేందుకు ఈ టెండర్లు నిర్వహించారు. అలాగే ములుముడిలోని దేవస్థానం భూములకు రెండోసారి కౌలు వేలం నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతగా చెప్పకోవడం హాస్యాస్పదం

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో సాయంత్రం వేళల్లో ఓ పది నిమిషాలు ప్రజల మధ్యన తిరిగి తాను అభివృద్ధి ప్రదాతగా నారాయణ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని 49వ డివిజన్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని సంతపేట, ఈద్గామిట్ట, నారాయణరావుపేట ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ 49వ డివిజన్‌కు సంబంధించి కొన్ని పనులు మినహా దాదాపు అన్ని పనులు పూర్తి చేశామన్నారు. నగర నియోజకవర్గ పరిధిలో ప్రతి డివిజన్‌లో పెండింగ్ లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఎవరో ఒక విద్యార్థి ఏదో ఒక కళాశాలలో బాగా చదివి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధిస్తే వారి వద్దకు వెళ్లి డబ్బులు ఇచ్చి ఆ విద్యార్థి నారాయణ కళాశాలలో చదివి ర్యాంకు సాధించినట్లుగా వేసుకోవడం నారాయణకు ముందు నుంచి అలవాటుగా మారిందన్నారు. అదే విధంగా నగరాన్ని నేనే అభివృద్ధి చేశానని పది సార్లు చెప్తే నిజమైపోతుందనే ఆలోచనతో ఆయన చెప్పడం వింతగా ఉందన్నారు. షేర్‌వాల్ టెక్నాలజీ పేరుతో పేదలను మోసం చేసి వారిపై భారం మోపడం తప్ప ఉపయోగపడే పనులు ఏమి చేశారని నారాయణను ప్రశ్నించారు. ఫేక్ ర్యాంకులతో ఏ విధంగా సృష్టించుకున్నారో అదే విధంగా అభివృద్ధి విషయంలో కూడా ఫేక్ మాటలు చెప్తున్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నగర నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎంత ఖర్చు చేశామని ఎప్పుడు అడిగినా చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. నగర నియోజకవర్గ సీటు నారాయణకే అని చంద్రబాబు చెప్పి దాదాపు ఐదు నెలలు అయినా ఇప్పటికీ ఆయన ప్రజలకు సరిగా కనిపించిన దాఖలాలు లేవన్నారు. కరోనా విపత్తు, వరదలు వచ్చినప్పుడు కనిపించని వ్యక్తి నారాయణ అన్నారు. అలాంటి వ్యక్తి 2024 ఎన్నికలు పూర్తయితే ప్రజలకు ఎలా కనిపిస్తారో అర్థం చేసుకోవాలన్నారు. స్థానిక డివిజన్ ఇన్‌చార్జి వందవాసి రంగా, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ సిద్ధిక్, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ఎం హరినారాయణన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పురోగతి, నిర్దేశిత లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై శాఖల వారీగా విభాగాధిపతులు రెండు వారాల ప్రణాళిక రూపొందించుకుని లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రధానంగా అసైన్‌మెంట్ భూముల పంపిణీ, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీపై అవగాహన, యాప్ డౌన్‌లోడింగ్, ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రులకు రోగులను పంపి చికిత్స అందించడం, జగనన్న సంపూర్ణ పోషణ, బాల్య వివాహాలు, వలంటీర్ల పోస్టుల భర్తీ, తదితర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యాలను అందుకునేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్నతో కలిసి కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమశిల జలాశయం అప్రాన్ పునరుద్ధరణ పనులు వెంటనే పూర్తి చేసేలా చూడాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టు రేణుకారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

దివ్యాంగ బాలికకు వినికిడి పరికరం

సంగం ఎస్టీకాలనీకి చెందిన దివ్యాంగురాలు బండి పూజిత వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆమె తల్లి నాగలక్ష్మి తన కుమార్తెకు వినికిడి పరికరం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా వినికిడి పరికరం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జేసీ కూర్మనాథ్, డీఆర్డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఈఓ గంగాభవాని, ఏడీపీ సుధాకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం



క్రీడాకారులను అభినందిస్తున్న కమిషనర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జాతీయ స్థాయి స్కే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర జట్టుకు గత నెల రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ నాగరాజకుమారి మాట్లాడుతూ నవంబరు 6,7,8 తేదీల్లో గోవాలో జరగనున్న జాతీయ స్కే క్రీడాపోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఆర్కే ఎతిరాజ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన క్రీడాకారులు, శిక్షణ అందించిన రాష్ట్ర స్కే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీంను అభినందించారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

నెల్లూరు(బారకాసు): జాతీయ స్థాయి స్కే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబర్చి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ స్కే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర క్రీడాకారులను సోమవారం కమిషనర్ కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ స్కే మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

రీ ఓపెన్ అర్జీలను విభాగాధిపతులే పరిశీలించాలి

- వర్షాకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కమిషనర్ వికాస్‌మర్మత్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రజలు సమస్యలపై అందజేసే అర్జీలు రీ ఓపెన్ అయితే సంబంధిత విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలు పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అనంతరం అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లల్లో పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వర్షాలకు అండర్ బ్రిడ్జిలు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారుదల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా మంచినీటి సరఫరా, పార్కుల నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వస్తున్న అభ్యర్థనలను విచారించి అర్హులందరికీ గృహాలు కేటాయించాలన్నారు. ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించి పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం అందజేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు.

హెన్రీ డ్యూనాంట్‌కు ఘన నివాళి

నెల్లూరు సిటీ: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ వర్ధంతిని మద్రాస్‌బస్టాండ్ సెంటర్‌లో రెడ్‌క్రాస్‌లో సోమవారం నిర్వహించారు. హెన్రీడ్యూనాంట్ చిత్రపటానికి రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ రక్తనిధి, స్పాస్టిక్ సెంటర్, మోర్గ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఎడతెరపి లేని వర్షం



నెల్లూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పలు చోట్ల సోమవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడింది. నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత కొద్దిరోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. జిల్లాలో కోవూరు, విడవలూరు, ముత్తుకూరు, వింజమూరు, వరికుంటపాడు, వావిలేటిపాడు తదితర ప్రాంతాల్లో చెదురుమదురు జల్లులతో కూడిన వర్షం పడింది.

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విద్యాబోధన



నెల్లూరు (టౌన్): ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నామని గీతాంజలి పీజీ కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. పార్థసారథినగర్‌లోని గీతాంజలి పీజీ కళాశాలలో ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేక్ కట్‌చేసి వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం సీఆర్టీ పేరుతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశయాన్ని వమ్ము చేయకుండా విద్యాబోధన అందిస్తామన్నారు. ఇటీవల విడుదలైన ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు వర్సిటీ స్థాయిలో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసతేజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



మాట్లాడుతున్న స్వర్ణావెంకయ్య

నెల్లూరు(బారకాసు): పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ క్లస్టర్–4 అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్‌సింగ్, జేసీఎస్ కన్వీనర్ పిండి సురేష్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దేవిశెట్టి కల్యాణ మండపంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32, 33, 34, 35, 36, 37, 38, 41 డివిజన్లకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో కలిపి 500 మందికిపైగా పాల్గొన్నారు. కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, దాసరి అమృత, పిండి శాంతి, యాకసిరి వాసంతి, తాళ్లూరు అవినాష్, కొవ్వకొల్లు విజయలక్ష్మి, షేక్ షామీద, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు దాసరి రాజేష్, యాకసిరిశరత్‌చంద్ర, షేక్ రియా జ్, కొవ్వకొల్లు బాబ్జియాదవ్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య, డీసీసీబీ డైరెక్టర్ కంతర్‌అలీ, జెడ్ ఎస్ జ్యోతి, అలగర ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి అనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. సీఎంగా వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ ఆంధ్రాకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎందుకు కావాలో వివరించాలన్నారు.

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి



వృద్ధుల సమస్యను వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 140 మంది హాజరయ్యారు. తమ సమస్యలపై ఎస్పీకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా ఆస్తి కోసం పిల్లలు వేధిస్తున్నారని, ప్రేమ పేరిట మోసం చేశారని, అత్తింటి వారు వేధింపులకు పాల్పడుతున్నారని, ఉద్యోగాల పేరిట మోసగించారని, దొంగతనం కేసుల్లో రికవరీ లేదని ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఆదేశించారు. ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధించడం, నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. స్నేహపూర్వకంగా, పరిచయం. ప్రేమపేరిట తీసుకున్న వ్యక్తిగత సమాచారాన్ని సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్ కన్సల్టెన్సీల ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో, ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, నగదు కట్టి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణారెడ్డి, పీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



46వ డివిజన్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న వేలూరు మహేష్



రోగులకు మందులు అందజేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ యలమవారిదిన్నె వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైద్యసేవలు అందిస్తున్న తీరును పరిశీలించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీని విస్తరించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడం ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు 21వ డివిజన్‌లో కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అధ్యక్షతన సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదలు ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపాలని, పేదల ప్రాణాలు విలువ తెలిసిన నాయకుడిగా రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దే సంపూర్ణ వైద్యం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేస్తున్నారని, ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మస్తాన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటరత్నం, పెంచలనర్సారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, సాయి, బుజ్జన్న, అశోక్, మంజు, సుబ్బారెడ్డి, రవి, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని 46వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కార్పొరేటర్ వేలూరు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.